



## శిష్యుడే గురువు

బడిలో వుపాధ్యాయుడు అహింసను గురించి బోధిస్తూ మాంసాహారం మంచిదికాదని, అది జీవహింసనీ చెప్పి దానిమీద విద్యార్థుల్ని వ్యాసం వ్రాయమన్నాడు. అందరూ యేదో వ్రాశారు. వేణు చాల తెలివైనవాడు. "మాంసాహరం జీవహింసే. కాని అంతకంటే ఘోరమైన హింసలు కూడా వున్నాయి. జంతువుల్ని కత్తితో ఒకేసారి నరికేస్తారు. దానిబాధ కొంచెంసేపే. కాని మానవుల్ని మానవులే కత్తిలేకుండానే తమ కరకుమాటలచేత క్రూరకృత్యాలచేత ప్రతి క్షణం చిత్రవధచేస్తున్నారు. ముఖ్యంగా అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్య యెంతో అందంగావుండి భక్తితో ప్రేమిస్తున్నాగాని ఆమెను నిర్దయగా అష్టకష్టాలు పెట్టి పరకాంతలపాలైపోతున్నా రెందరో. ఇది ఆమె హృదయములో తీరనిబాధని వారికి తెలియదేమో. ఇంతకంటే వేరే పెద్ద హింస లేదు" అని వ్రాశాడు. ఇదంతా చదివి వుపాధ్యాయుడు అలాగే రాతిబొమ్మలాగుండిపొయ్యాడు. తన విషయం వీడికెల్లా తెలిసిందో ననుకున్నాడు. తన తప్పు బాగా అర్థం చేసుకున్నాడు. వెంటనే ఆయన హృదయం పరివర్తన చెందింది. వేణు చేసిన ఉపకారానికి కృతజ్ఞత చూపదలచుకున్నాడు. ఇప్పుడు శిష్యునే గురువుగా భావిస్తున్నాడు.

కె. రాధిక.

## రూపాయి ముద్దర దక్షిణ

ముద్దరకొట్టేసిన స్టాంపులు, మన దేశంవీ పైదేశంవీ తీసి దాచడం నాకు మహా సరదా. ఒకరోజున మానాన్నగారికి వచ్చిన వీపీమీద రూపాయి ముద్దరతీసి జాగ్రత్తగా దాచేను. అ దాచడంచూచి మాతమ్ముడు "ఏమిట్రా అన్నయ్యా అది" అని అడిగేడు. చిన్న కుఱ్ఱాడు అడుగుతున్నాడు కదా అని "రూపాయికి ఎంత విలువుందో దీనికీ అంతే విలువని చెప్పేను"

మర్నాడు వినాయకచవితని, మా తమ్ముడు స్కూలుకి, కొబ్బరికాయలు అరటిపండ్లు పట్టుకెళ్తాడని కొనితెచ్చేడు బంట్రోతు. మాతమ్ముడు అవన్నీ ఓ పళ్ళెంలోపెట్టి అమ్మఇచ్చిన దక్షిణ అణా తీసుకొని స్కూలుకి బయలుదేరుదామనుకున్నాడు. ఇంతలో ఏమి ఆలోచన తట్టిందో వాడికి నాగదిలోకి గబగబా వచ్చి నాకో అణా ఇచ్చి "సిగిరెట్లు కొనుక్కోరా అన్నయ్యా" అన్నాడు. ఎందుకురా వీడు దెయ్యానికైనా బిచ్చం పెట్టనివాడు నాకు అణా ఇస్తున్నాడనుకొని సిగిరెట్టు కొనడానికి వెళ్ళినట్టుగ నటించి గోడవార దాంకున్నాను.

ఇంతలో మా వాడు ముద్దరకొట్టిన రూపాయి ముద్దరతీసి పళ్ళెంలోపెట్టి గబగబా స్కూలుకెళ్ళేడు. నేనుకూడా ఏమిటి జరుగుతుందో చూదామని వాని వెనకాలే వెళ్ళేను. మేష్టరుగారు మా తమ్ముడు తెచ్చిన కొబ్బరికాయలు అంటిపళ్ళు అన్నీ అందుకొని దక్షిణ ఎంతరా తెచ్చేవు కన్నా అని అడిగేడు. "రూపాయండీ" అని గట్టిగా అన్నాడు మాతమ్ముడు. మేష్టరు మొహం చేటంతయింది. దక్షిణ ఏదన్నాడు. మనవాడు ముద్దరకొట్టేసిన రూపాయిస్టాంపు ఈయగానే మేష్టరుమొహంలో నెత్తురుచుక్క లేకపోవడమే కాకుండా మా కన్నడిని తందామన్నంత కోపం వచ్చింది.

వెనకాలున్న నేను కడుపు చెక్కలయ్యేటట్టు నవ్వుకుంటూ మేష్టరుతో సంగతంతా చెప్పేను. మేష్టరుగారికి కోపంవచ్చి "కన్నా వెధవ గొప్పచెప్పకపోతే, అమ్మగారిచ్చిన అణానే ఈయకూడదూ!" అని అన్నాడు. మా తమ్ముడు మొహం దించుకున్నాడు.

ఘండికోట అప్పల నరసింహం.

* * *

## తప్పుల తమాషా

ఆనాడు మా గ్రామములో కొత్త సినిమా. కాస్త చీకటి వుండగానే గోడపైన పోస్టర్లు కరిపించుకుంటూ పోతూ ఒక యింటిదగ్గర అంటిస్తూయుండగా ఆ యింటిఆమె అప్పుడే నిద్రనుండిలేచి ఇంటిముందరకువచ్చి అబ్బాయిని ఏం సినిమా నాయనా యీదినం అన్నది. వాడు 'మనమిద్దరము' అన్నాడు. ఆమె కోపంతో ఏరా వెధవా నేను మర్యాదగా అడిగితే నీవు అలా పోకిరిగా జవాబు ఇస్తావేమిరా? ఎందుకురా, నీకంతపొగరు అని తిట్టటం మొదలెట్టింది. ఈ అల్లరి